భద్రకాళి శరణం మమ

శ్రీభద్రకాళి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం చంద్రమంట క్రమంలో అమ్మవారిని ఉత్సవమూర్తిగా అలంకరించారు. అనంతరం సింహవాహన సేవ, సాయంత్రం మహాపూజ మల్లిని దుర్గా క్రమంలో ఆరాధించి గజ వాహనసేవ జరిపారు. వాహనసేవలో ఊరేగుతున్న అమ్మవారికి మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. భద్రకాళీ శరణం మమ అంటూ ప్రణమిల్లారు. జగన్మాత దర్శనంతో మంత్ర సిద్ధి కలుగుతుందని ప్రధానార్చకుడు శేషు తెలిపారు. తౌటమ్ భాస్కర్- శిరీష, విశ్వతేజ, నక్షత్ర తదితరులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. ఐఏఎస్ అధికారి గిరిజా శంకర్, అన్నపూర్ణ దంపతులు, సీఐఎస్ఎఫ్ డీఐజీ అపరాజిత తదితర ప్రముఖులు భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఈవో శేషు భారతి పర్యవేక్షించారు. – న్యూస్‌టుడే, రంగంపేట



సింహ వాహనసేవలో మహిళలు

ముగిసిన కేయూ సెర్చ్ కమిటీ సమావేశం

ఈనాడు, వరంగల్, కేయూ క్యాంపస్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం 15వ ఉప కులపతి నియామకం కోసం ఏర్పాటైన సెర్చ్ కమిటీ కీలక సమావేశం శనివారం ముగిసింది. వీసీ నియామకం కోసం ఏర్పాటు చేసిన త్రిసభ్య అన్వేషణ కమిటీ సభ్యులు జమ్మూ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య సంజీవ్ జైన్ (యూజీసీ నామిని), రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి (ప్రభుత్వ నామిని), జేఎన్‌టీయూ విశ్రాంత ఆచార్యులు ఆవుల దామోదర్ (కేయూ నామిని)లు హైదరాబాద్‌లోని సచివాలయంలో సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. కేయూ వీసీ పదవి కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల బయోడేటాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వడపోతల తర్వాత అత్యంత ప్రతిభగల మూడు పేర్లతో జాబితాను తయారు చేశారు. ఈ జాబితాను సీల్డు కవర్‌లో పొందుపరిచి రాష్ట్ర గవర్నర్‌కు పంపించినట్లు సమాచారం. కేయూతో పాటు రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల కోసం గత కొన్ని నెలలుగా జరుగుతున్న కసరత్తు కొలిక్కి వస్తోంది. కేయూ ఉప కులపతి పదవికి ఉన్నత విద్యామండలి దరఖాస్తులు ఆహ్వానించగానే సుమారు 158 మంది వరకు ఆచార్యులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో విశ్రాంత ఆచార్యులు కొందరు కాగా, కేయూతో పాటు, ఇతర విశ్వవిద్యాలయాల్లో ఆచార్యులుగా పనిచేస్తున్న వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం వీసీ నియామకాన్ని అత్యంత పకడ్బందీగా చేపట్టేందుకు సెర్చ్ కమిటీని నియమించింది. కేయూ గత వీసీ తాటికొండ రమేశ్‌పై పలు ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఈ సారి వీసీ నియామకంలో పారదర్శకంగా వ్యవహరించాలని ప్రభుత్వం భావించింది. ఈ క్రమంలో అన్వేషణ కమిటీ ఎంతో కసరత్తు చేసింది. తాజాగా ఒకసారి సెర్చ్ కమిటీ సమావేశం వాయిదా పడడంతో మళ్లీ ఎప్పుడు జరుగుతుందనే సందేహాలు వెల్లువెత్తాయి. వెంటనే శనివారమే సమావేశం కావడం గమనార్హం. త్వరలో కేయూకు వీసీగా బాధ్యతలు తీసుకునేది ఎవరన్నదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

పండగ ప్రత్యేకం.. సంప్రదాయాల మమేకం

దసరా, సద్దుల బతుకమ్మ పండగల పేర్లు చెబితే ఎక్కడలేని సంతోషం కలుగుతుంది... ఎక్కడెక్కడో స్థిరపడినవారంతా.. సొంతూళ్లకు సంతోషంగా తరలివస్తారు.. బడులు, కళాశాలలకు సెలవు రావడంతో పిల్లలంతా అమ్మమ్మ, నానమ్మ ఇళ్లకు వచ్చి హాయిగా ఆటలాడతారు.. ఎంగిలిపూల బతుకమ్మ మొదలుకొని దసరా వరకు పల్లెల్లో బోలెడంత సందడి కనిపిస్తుంది. మహిళలంతా గుళ్లల్లో, చెరువు కట్టల వద్ద బతుకమ్మ ఆటపాటలతో అలరిస్తారు. ఇక ఓరుగల్లు ప్రాంతంలో ఈ పండగను కొన్ని ఊళ్లల్లో మరింత ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు.. ఆ విశేషాలతో 'ఈనాడు' కథనమిది..

–ఈనాడు, వరంగల్

అదిగదిగో మా ఊరు..
దసరా వచ్చిందంటే దాని తీరేవేరు..
అన్నాతమ్మీ అంటూ ఆత్మీయ పలకరింపులు
వదినా మరదళ్ల నవ్వుల తుళ్లింతలు..
గునుగు తంగేడు సోయగాలతో బతుకమ్మ ఆటలు..
ఉయ్యాలో.. రామ ఉయ్యాలో.. అంటూ ఆడపడుచుల పాటలు..
బంతి పూలు, మామిడాకులతో స్వాగతం పలికే గుమ్మాలు..
కమ్మని పిండివంటలతో ఇంటింటా ఘుమఘుమలు..
పట్టు పరికిణీల్లో సందడిచేసే పడుచు పిల్లలు..
జమ్మిచెట్టు వద్ద ఆత్మీయ ఆలింగనాలు..
అందుకే పట్నంవారంతా పల్లెబాట పడతారు..
ఎవరికివారు.. ఊళ్లల్లో
'ప్రత్యేకత'ను చాటుతున్నారు.

ఆదివారం ప్రత్యేకం


ఉప్పొంగే దేశభక్తి



దేశమంతా పంద్రాగస్టు, 26 జనవరి, తదితర రోజుల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు. మహబూబాబాద్ జిల్లా గార్లలో మాత్రం దసరా రోజున నెలవంకను పోలిన జెండాను ఎగురవేయడం ఆనవాయితీగా వస్తోంది. గార్లలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న క్రమంలో ఆ వీధిని జెండా బజారుగా పిలుస్తున్నారు. పండగ రోజు పంచాయతీ నుంచి ఊరేగింపుగా జెండాను తీసుకెళ్లి మసీదు సెంటర్‌లో ఎగురవేస్తారు. అనంతరం తూర్పాంజనేయ స్వామి ఆలయంలో శమీ పూజ చేస్తారు.

సరిహద్దు నుంచి సొంతూరుకు

వరంగల్ జిల్లా నర్సంపేటలో అన్ని ప్రాంతాల్లోలాగే వేడుకలు ఎంతో ఉత్సాహంగా చేస్తారు. హైదరాబాద్, వరంగల్ తదితర ప్రాంతాల్లో స్థిరపడ్డవారే కాదు సరిహద్దులో ఉన్న సైనికులు తప్పకుండా వస్తారు.. నర్సంపేటకు చెందినవారు సుమారు 30 మందికిపైగా సైన్యంలో సేవలందిస్తున్నారు.



భారీ రావణ వధ



వరంగల్ ఉర్సుగుట్ట రంగలీలా మైదానంలో దసరా వేడుకలు కోలాహలంగా జరుగుతాయి. లక్షకుపైగా జనం హాజరై వేడుకల్ని తిలకిస్తారు. 65 అడుగుల రావణాసురుడి బొమ్మ తయారుచేస్తారు. అనంతరం బాణసంచాతో పేల్చేస్తారు. దసరా నాడు స్థానిక ఆర్య సమాజ్ నుంచి ఎడ్లబండిపై సీతారాముల వేషధారణలో కళాకారులను తీసుకొస్తారు. ముందు రంగస్థల కళాకారులు చిరుతల భజన చేస్తూ ఊరేగింపుగా తరలివస్తారు. వీరికి ఉత్సవ కమిటీ స్వాగతం పలుకుతుంది. అనేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాక చివరకు రావణవధ ఉంటుంది. ఇదెంతో కనువిందు కలిగించే ఘట్టం. కర్ణాటకలోని మైసూరు తర్వాత అంత కోలాహలంగా వేడుకలు జరిగేది ఇక్కడే అని స్థానికులు చెబుతారు.

వందేళ్ల నాటి జమ్మిచెట్టు



పాండవులు అరణ్య వాసం సమయంలో జమ్మిచెట్టుపై ఆయుధాలు పెట్టారని, ఆ తర్వాత చెట్టుమీద నుంచి తీసి యుద్ధానికి వెళ్లి.. విజయం కలిగిందని పురాణ ప్రతీతి. అందుకే ప్రతి ఊళ్లో దసరా రోజు గ్రామస్థులంతా జమ్మి చెట్టుకు పూజ చేయడం ఆనవాయితీ. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ల్యాబర్తి గ్రామంలో సుమారు వందేళ్ల జమ్మి వృక్షం ఉంది. పండగ రోజు సాయంత్రం ఊరివారంతా దప్పుచప్పుళ్లతో పెద్ద గంపలో సొరకాయ, సజ్జ, జొన్న మొక్కలను పట్టుకుని దసరా బండ వద్దకు చేరుకుంటారు. అక్కడ కొత్తగా నిర్మించిన పాకలో సొరకాయకు పూజ చేస్తారు. అనంతరం జంతు బలికి బదులు సొరకాయను కోస్తారు. వారి ఊరి జమ్మి చెట్టు వద్దకు వెళ్లి కంకణాలు కట్టుకుని పూజలు చేస్తారు.

అయిదో రోజు అద్భుతంగా



బతుకమ్మ పండగ అంటే సాధారణంగా మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ, చివరి రోజు సద్దుల బతుకమ్మను ఊరువాడా సందడిగా చేస్తారు. మహబూబాబాద్ జిల్లావ్యాప్తంగా అనేక గ్రామాల్లో అయిదో రోజు కూడా బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహిస్తారు. భారీ పరిమాణంలో బతుకమ్మలను పూలతో పేర్చి మహిళలు బతుకమ్మలు ఆడి అనంతరం చెరువులో నిమజ్జనం చేస్తారు.

నేడు నీటి సరఫరా ఆలస్యం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: వరంగల్ ప్రాంతం దేశాయిపేట జోన్ పరిధిలో ఆదివారం తాగునీటి సరఫరా ఆలస్యం అవుతుందని గ్రేటర్ వరంగల్ ఈఈ ఆర్.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్తు సరఫరా అంతరాయంతో ధర్మసాగర్ చెరువు నుంచి రా వాటర్ పంపింగ్ ఆలస్యమైందని, దీంతో ఆదివారం నీటి సరఫరాలో స్వల్ప అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు గమనించి, సహకరించాలని కోరారు.

ఆత్మకూరు మార్కెట్ ఛైర్‌పర్సన్‌గా సునంద



ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఛైర్‌పర్సన్‌గా ఆత్మకూరు మాజీ ఎంపీపీ బీరం సునంద, వైస్ ఛైర్మన్‌గా తంగెళ్లపల్లి తిరుపతి, సభ్యులుగా కాడబోయిన రమేష్, పిట్టల రాజేందర్, షేక్ నవీర్, శానబోయిన రవి, దామెర చక్రీయ, లక్కిడి సుజాత, ముంద్రతి భిక్షపతి, పల్లె దయాకర్, గౌరు రాజిరెడ్డి, జాడి రాజీవ్ గాంధీ, పాడి గణపతిరెడ్డి, సీహెచ్ భానుప్రకాశ్‌లను నియమించారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

బాలసముద్రం, న్యూస్‌టుడే : మరమ్మతు పనుల కారణంగా ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని హసన్‌పర్తి ఏడీఈ అశోక్ తెలిపారు. నారాయణ్‌నగర్, శ్రీనివాస కాలనీ, మంత్రపురి కాలనీ, బస్వారెడ్డి టౌన్‌షిప్, కిట్స్ కళాశాల ఎదురు ప్రాంతం, గ్రీన్‌ఉడ్ పాఠశాల ప్రాంతాల్లో సరఫరాలో కరెంటు సరఫరా ఉండదని, వ్యాపారులు, వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

అవునండి.. ఇది జాతీయ రహదారే!



హైదరాబాద్ - భూపాలపట్నం 163 నెంబర్ జాతీయ రహదారి ఇది. ఇటీవల కురిసిన వర్షాలకు ఆత్మకూరు మండలం కటాక్షపూర్ పెద్ద చెరువు అలుగు పారడంతో వరద ఉద్ధృతికి రోడ్డు గుంతలు పడి రాళ్లురప్పలు తేలి ప్రమాదకరంగా మారింది. రెండు సంవత్సరాల క్రితం రోడ్డు విస్తరణలో భాగంగా వంతెన నిర్మాణానికి ఆమోదం వచ్చింది. నిర్మాణానికి 317 కోట్లు నిధుల మంజూరు మంజూరైనా పనులు మొదలు కాలేదు. యంత్రాంగం వెంటనే స్పందించి వంతెన నిర్మాణం చేయాలని స్థానికులు కోరుతున్నారు. – ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే, ఆత్మకూరు

ప్రయాణం.. ప్రాణ సంకటం



కాజీపేట ప్రధాన రహదారులు ఛిద్రమై ప్రమాదకరంగా మారాయి. నిత్యం వందల వాహనాలు రాకపోకలు సాగించే మడికొండ, కడిపికొండ వంతెనపై ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. విద్యుత్తు దీపాలు వెలగక చీకటి పడితే గుంతలు కనపడక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మడికొండ మూల మలుపు వద్ద గుంతలోపడి గాయాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే గుంతలను పూడ్చివేయాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కాజీపేట టౌన్

రహదారికి మరమ్మతులు



సిద్దిపేట నుంచి ఎల్కతుర్తి వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి పనుల్లో నాణ్యత కొరవడి రోడ్డుపై గుంతలు పడిన వైనంపై 'రహదారి నిర్మాణంలో కొరవడిన నాణ్యత' శీర్షికన గత నెల 30న 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఎల్కతుర్తి-ములుకనూర్ మధ్య ఏడు కిలోమీటర్ల పరిధిలో ఏర్పడ్డ గుంతలు, ధ్వంసమైన రహదారిపై తారు తొలగించి కంకరతో రోలింగ్ చేశారు. శనివారం కొత్తపల్లి శివారులో రోలింగ్ చేసిన కంకరపై తారు పనులు చేపట్టారు. – న్యూస్‌టుడే, భీమదేవరపల్లి

ఈనాడు కథనానికి స్పందన




ఇంటి చుట్టూ నిలిచిన మురుగు

సమస్యల వలయంలో లోటస్ కాలనీ

జులైవాడ, న్యూస్‌టుడే : హనుమకొండలోని 49వ డివిజన్ లోటస్‌కాలనీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కనీస మౌలిక సదుపాయాల్లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 20 ఏళ్ల కిందట ఏర్పడిన కాలనీలో వ్యాపారులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ఎక్కువగా నివాసాలు కట్టుకొని ఉంటున్నారు. ఏటా నగరపాలక సంస్థకు ఆస్తి పన్ను చెల్లిస్తున్నా సదుపాయాల కల్పనలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు సైతం వీరి ఇబ్బందులను పట్టించుకోవడం లేదు. కాలనీలో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. మట్టిరోడ్లు గుంతలు పడి, వర్షాలకు బురదమయంగా మారుతున్నాయి.

మురుగుతో ప్రబలుతున్న దోమలు..

డ్రైనేజీ కాల్వలు పూర్తిస్థాయిలో లేవు. ఇళ్ల నుంచి వెలువడే మురుగు రోడ్లపైన, ఖాళీ స్థలాల్లో నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. లోటస్‌కాలనీ రోడ్డు నెంబరు 1, 2 ప్రాంతంలో మురుగు నిలిచి దోమలకు ఆవాసంగా మారింది. ఓవైపు దుర్గంధం, మరోవైపు దోమలతో జనం అవస్థలు పడుతున్నారు. డెంగీ, చికున్ గున్యా జ్వరాలు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత అధ్వానంగా మారింది.



రోడ్డు నంబర్ 2లో అధ్వానంగా రోడ్డు

● రోడ్డు నెంబరు 2లో మట్టిరోడ్డు వర్షాలకు బురదమయంగా మారి వాహనదారులు అదుపుతప్పి పడుతున్నారు. ఖాళీ స్థలాల్లో చెట్లు పెరిగి పాములు సంచరిస్తున్నాయి. రోడ్డు పక్క నిలిచి మురుగులో పందులు స్వైర విహారం చేస్తున్నాయి.

● కాలనీలో సమస్యలను నగరపాలక సంస్థ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని లోటస్ కాలనీ కమిటీ అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులకు చెబితే కొన్నిచోట్ల రోడ్లు వేయించారని, ఇంకా కొన్ని వీధుల్లో వేయాల్సి ఉందన్నారు. 20 ఏళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నామని, ఏటా పన్నులు చెల్లిస్తున్నా సదుపాయాల కల్పనలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని కాలనీవాసి ఎస్.దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు.

కీటకజనిత వ్యాధులను నియంత్రించాలి

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: జిల్లాలో డెంగీ కేసులు ఎక్కువగా నమోదవుతున్న దృష్ట్యా నగరంలో డివిజన్ల వారీగా కీటకజనిత వ్యాధుల నియంత్రణ చేపట్టాలని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్ నాయక్ సూచించారు. శనివారం హనుమకొండ జిల్లా కడిపికొండ, మడికొండ ఆరోగ్య ఉప కేంద్రాలను సందర్శించిన అనంతరం జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో వరంగల్, హనుమకొండ జిల్లాల డీఎంహెచ్‌వోలు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, కీటకజనిత వ్యాధుల నియంత్రణ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. వ్యాధులు నమోదైన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు, ఇంటింటా జ్వర సర్వే చేయాలన్నారు. వరంగల్, హనుమకొండ డీఎంహెచ్‌వోలు డా.వెంకటరమణ, డా.లలితాదేవి మాట్లాడుతూ.. జిల్లాలో వ్యాధుల నియంత్రణకు చేపడుతున్న కార్యాచరణను వివరించారు. సమావేశంలో అసిస్టెంట్ డైరెక్టర్ నాగయ్య, ఎంటమాలజీ టీం ప్రోగ్రాం అధికారులు డా.పద్మశ్రీ, డా.మదన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డా.గోపాలరావు, డా.ప్రకాశ్, ప్రోగ్రాం అధికారులు డా.మోహన్‌సింగ్, డెమో అశోక్‌రెడ్డి, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, ఇన్‌ఛార్జి మలేరియా అధికారి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్ నాయక్. చిత్రంలో వరంగల్, హనుమకొండ డీఎంహెచ్‌వోలు

ముగిసిన డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: హనుమకొండ సుబేదారిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన డీఎస్సీ-2024 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన శనివారం ప్రశాంతంగా ముగిసినట్లు డీఈవో డి.వాసంతి తెలిపారు. జిల్లాలో 187 మంది ఉపాధ్యాయ ఖాళీల కోసం 1:3 నిష్పత్తి ప్రాతిపదికన అభ్యర్థులను పిలిచినట్లు తెలిపారు. 463 మంది అభ్యర్థులకు 437 మంది హాజరుకాగా 30 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. పది ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి, ధ్రువపత్రాల పరిశీలన పకడ్బందీగా నిర్వహించినట్లు పేర్కొన్నారు.

కదలని దస్త్రాలు.. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే

గ్రేటర్ వరంగల్‌లో పౌరసేవలు తీవ్ర ఆలస్యం అవుతున్నాయి. అభివృద్ధి పనులు, ఇతర బిల్లుల చెల్లింపుల దస్త్రాలు చకచకా కదులుతున్నాయి. పౌరులకు సంబంధించిన దస్త్రాలు రోజుల తరబడి తొక్కి పెడుతున్నారు. వివిధ పనుల కోసం నగర ప్రజలు బల్దియా, కాజీపేట, కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

భవన నిర్మాణ అనుమతులు, కొత్త ఇంటి నంబర్లు, ఆస్తి పేరు మార్పిడి, కుళాయి కనెక్షన్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ రోజుల తరబడి పెండింగ్‌లో పెడుతున్నారు. రాష్ట్ర పురపాలక శాఖ జారీ చేసిన సిటిజన్ ఛార్టర్ అమలు కావడం లేదు. ఉన్నతాధికారులు, వింగ్ అధికారులు, క్షేత్రస్థాయి ఉద్యోగులు, పర్యవేక్షకులు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగుల వరకు వందల సంఖ్యలో దస్త్రాలు(ఫైళ్లు) పెండింగ్‌లో ఉన్నాయి. సిటిజన్ ఛార్టర్ అమలుపై కమిషనర్, అదనపు కమిషనర్ సమీక్ష లేకపోవడంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

రెండు విభాగాల్లోనే..

● పన్నుల విభాగంలో కొందరు ఆర్‌ఐలు కొత్త ఇంటి నంబర్ల కేటాయింపు, ఆస్తిపేరు మార్పిడి దస్త్రాలు ఉద్దేశపూర్వకంగా ఆపుతున్నారు. కాశీబుగ్గ, కాజీపేట సర్కిల్‌లో ముగ్గురు, నలుగురు ఆర్‌ఐలు ఫోన్లు సైతం ఎత్తడం లేదు. ప్రజలకు జవాబుదారీతనం కరవైంది. పెండింగ్ దస్త్రాలపై ఉప కమిషనర్లు సమీక్షించడం లేదు. పన్నుల విభాగంలో అత్యవసరమైనవి 450- 500 దస్త్రాలు ఆపినట్లు సమాచారం.



బల్దియా కార్యాలయంలో సిటిజన్ ఛార్టర్ బోర్డు


● పట్టణ ప్రణాళిక విభాగం పూర్తిగా అదుపుతప్పింది. టీఎస్-బీపాస్ నిబంధనలు తూచ్ అంటున్నారు. భవన నిర్మాణ అనుమతులు 30-45 రోజుల పాటు పెండింగ్‌లో పెడుతున్నారు. రూపాయి భవన నిర్మాణ అనుమతులు చిన్నాచితక కారణాలతో తిరస్కరిస్తున్నారు. కాశీబుగ్గ సర్కిల్‌లో ఇద్దరు అధికారులు డబ్బులిస్తేనే సంతకాలు పెడుతామంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఈ విద్యాలయం.. సైనికుల కర్మాగారం!

ఖానాపురం(నర్సంపేట), న్యూస్‌టుడే: వరంగల్ జిల్లా ఖానాపురం మండలం అశోక్‌నగర్‌లోని సైనిక్ స్కూల్‌లోని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ప్రిపరేటరీ అకాడమి దేశరక్షణకు మెరికల్లాంటి సైనికులను అందిస్తోంది. ఇక్కడ చదివిన పలువురు విద్యార్థులు సరిహద్దుల్లో సైనికులుగా పనిచేస్తూ దేశ రక్షణలో పాలు పంచుకుంటున్నారు. ఈ విద్యాలయంలో చేరిన నిరుపేద గిరిజన విద్యార్థులకు విద్య, వసతితో పాటు వ్యాయామం, దేహదారుఢ్యం తదితర అంశాల్లో పటిష్ఠ తర్ఫీదు ఇస్తున్నారు. పలు అంశాలను ఆకళింపు చేసుకుంటున్న విద్యార్థులు.. ప్రభుత్వం నిర్వహించే శారీరక, రాత పరీక్షలను సులువుగా అధిగమించి భారత సైన్యం, అగ్నివీర్, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, నేవీ, పోలీసు తదితర విభాగాల్లో ఎంపికై సేవలందిస్తున్నారు. 1984లో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పాలనలో ఏర్పాటు చేసిన గిరిజన ఆశ్రమ పాఠశాల అంచెలంచెలుగా ఉన్నతీకరణ చెంది సైనిక్‌స్కూల్‌గా మారింది. 2022, 2023 విద్యా సంవత్సరాల్లో త్రివిధ రక్షణ దళాలు, భద్రత, తదితర విభాగాల్లో 22 మంది సేవలందిస్తున్నారు. అగ్నివీర్‌కు నలుగురు, జీడీఎస్ పోస్టల్‌కు ముగ్గురు, ఫైర్‌మెన్ ఏవోసీకి ఒకరు, సీఆర్పీఎఫ్‌కు ఒకరు, బీఎస్ఎఫ్‌కు ఒకరు, భారత సైన్యానికి ఐదుగురు, నావికా దళానికి ఇద్దరు, టీఎస్ పోలీస్ కానిస్టేబుళ్లుగా ఐదుగురు ఎంపికయ్యారు.


సైనిక్ పాఠశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

డిగ్రీ ద్వితీయ ఏడాదిలోనే ఎంపికయ్యా..



సైనిక్‌స్కూల్‌లో ఇంటర్‌లో చేరాను. డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా ఆర్మీకి ఎంపికయ్యాను. ఇక్కడి అధ్యాపకులు ఇచ్చిన తర్ఫీదు వల్లే ఇది సాధ్యమైంది. ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్‌లో పని చేస్తున్నా. దేశ రక్షకుడిగా పని చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత శిఖరాలకు చేరవచ్చు. **-రాము**

అధ్యాపకుల శిక్షణ తోడ్పడింది



ఇంటర్‌లో పాఠశాలలో చేరాను. భారత సైన్యానికి ఎంపికయ్యేందుకు. అధ్యాపకులు, ఇన్‌స్ట్రక్టర్లు అందించిన శిక్షణ తోడ్పడింది. తక్కువ సమయంలో ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది. **-జవిందర్**

గురుకులంలో చదవడం అదృష్టం



డిఫెన్స్‌లో ఫైర్‌మెన్ ఏవోసీకి ఎంపికయ్యాను. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతుండగా ఉద్యోగం వచ్చింది. గురుకులంలో చదవడం నా అదృష్టం. క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఏదైనా సాధించొచ్చు. తల్లిదండ్రుల రుణం తీర్చుకుంటా. **-సింహాద్రి**

ఉన్నతాధికారిగా దేశానికి సేవలందిస్తా



డిగ్రీ చదువుతుండగానే ఉద్యోగం వచ్చింది. నేవీలో శిక్షణ పూర్తయింది. పాఠశాల ఉపాధ్యాయుల సూచనలు పాటించి పట్టుదలతో చదివి ఈవెంట్లు చేశాను. ఉన్నతాధికారిగా దేశానికి సేవలందిస్తా. **-భరత్**

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ - సురేందర్, ప్రిన్సిపల్, సైనిక్‌స్కూల్, అశోక్‌నగర్

క్రమశిక్షణతో చదివితే ఉద్యోగాలు సాధించడం సులువని సైనిక్‌స్కూల్ విద్యార్థులు నిరూపించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతాం. అందరి కృషితోనే ఇది సాధ్యమైంది.

ఉపాధి కోసం వెళ్లి.. తూటాకు బలై!

● ఉగాండాలో జనగామ సివిల్ ఇంజినీర్ హత్య


తిరుమలేష్ (పాత చిత్రం)


స్వగృహంలో రోదిస్తున్న తల్లి కిష్టమ్మ, బంధువులు

జనగామ టౌన్, న్యూస్‌టుడే : ఉన్నత విద్య అభ్యసించారు.. ఉపాధి మార్గం వెతుక్కుంటూ విదేశానికి వెళ్లారు.. జీవితం అంతా సాఫీగా సాగుతుందనుకున్న సమయంలో తుపాకీ తూటా రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. ఈ ఘటన జనగామ పట్టణంలో విషాదం నింపింది. జనగామ పట్టణం తొమ్మిదో వార్డు గిర్నిగడ్డకు చెందిన ఇటికాల తిరుమలేశ్(42) సివిల్ ఇంజినీర్ పూర్తి చేశారు. కొంతకాలం కరీంనగర్‌లో ఉద్యోగం చేసిన అనంతరం ఉగాండా దేశంలోని రాయల్‌టెక్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో అవకాశం రావడంతో పదేళ్ల క్రితం అక్కడికి వెళ్లారు.. ప్రాజెక్టు మేనేజర్ హోదాలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఉగాండాలోని నమ్మశాల ప్రాంతంలోని కంపెనీలో శుక్రవారం తిరుమలేష్ విధుల్లో ఉండగా శుక్రవారం ఉదయం 9.30 గంటల సమయంలో(భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12.30 గంటలు) అదే కంపెనీకి చెందిన సెక్యూరిటీ గార్డు తాగిన మైకంలో ఒక్కసారిగా తుపాకీతో గాల్లోకి రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. భారీ శబ్దం విని బయటకు వచ్చిన తిరుమలేష్‌పైనా విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ తర్వాత సెక్యూరిటీ గార్డు కూడా తనను తాను కాల్చుకుని చనిపోయాడు. ఈ ఘటనతో భయకంపితులైన కంపెనీలోని ఇతర ఉద్యోగులు బయటకు రాలేదు. తిరుమలేష్ మృతిచెందిన విషయాన్ని కంపెనీ ప్రతినిధులు జనగామలో ఉంటున్న తల్లి కిష్టమ్మ, సోదరుడు చిన్నాకు సమాచారం అందించడంతో కుటుంబ సభ్యులంతా ఒక్కసారిగా శోకసంద్రంలో మునిగిపోయారు. తిరుమలేష్‌కు భార్య సునీత, కుమార్తె అఖిల, కుమారుడు వరుణ్ ఉన్నారు. కుమార్తె అఖిల నిజామాబాద్‌లోని అమ్మమ్మ ఇంటి వద్ద 8వ తరగతి చదువుతోంది. కుమారుడు వరుణ్ ఉగాండాలోనే తల్లిదండ్రులతో ఉంటూ పదోతరగతి చదువుతున్నాడు. తిరుమలేష్ తండ్రి కిష్టయ్య కరోనాతో నాలుగేళ్ల క్రితం మృతి చెందారు. మృతుడి తల్లి కిష్టమ్మతో పాటు మరో సోదరుడు చిన్నా, సోదరి హేమలత జనగామలోనే ఉంటున్నారు. తిరుమలేష్ మృతి వార్త తెలియగానే ఆయన ఇంటికి బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించి కన్నీళ్లు పెట్టుకున్నారు.

అంతా సివిల్ ఇంజినీర్లే

మృతిచెందిన తిరుమలేష్ సివిల్ ఇంజినీర్ కాగా, అతని సోదరుడు చిన్నా కూడా సివిల్ ఇంజినీర్‌గా సిద్దిపేటలో పనిచేస్తున్నారు. తండ్రి కిష్టయ్య సివిల్ ఇంజినీరింగ్ విభాగంలోనే పనిచేసేవారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించి మంచి స్థానాలకు చేర్చిన తండ్రి కిష్టయ్య కరోనాతో దూరంగా కాగా, ఇప్పుడు ఇంటి పెద్ద కొడుకు తిరుమలేష్ కూడా చనిపోవడంతో తల్లి కిష్టమ్మతో పాటు కుటుంబమంతా శోకసంద్రంలో మునిగిపోయింది. తిరుమలేష్ మృతదేహాన్ని మంగళవారం వరకు జనగామకు తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు సోదరుడు చిన్నా తెలిపాడు. ఉగాండాలోని ఎంబసీ అధికారులకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ద్వారా సమాచారం చేరవేసి మృతదేహం రప్పించేందుకు స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చొరవ తీసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

అవివాహితులకు సువర్ణావకాశం

● నేడు ఎస్టీ (బంజార/లంబాడ) కులాల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి డాట్ నెట్ ఉచిత నమోదు కార్యక్రమం



బాలసముద్రం, న్యూస్‌టుడే : తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు పెళ్లిపందిరి' వేదికగా సువర్ణ అవకాశం కల్పిస్తోంది. ఎస్టీ (బంజారా/లంబాడ) కులాలకు చెందిన అవివాహిత వధూవరుల కోసం ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. బాలసముద్రంలోని 'ఈనాడు' కార్యాలయంలో ఆదివారం (అక్టోబర్ 6వ తేదీ) ఈ కార్యక్రమం చేపట్టింది. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులు లేదా సంబంధిత కుటుంబీకులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5:30 గంటలలోపు ఈ కార్యక్రమంలో పాల్గొని ఉచితంగా వివరాలను నమోదు చేసుకోవచ్చు. ఫోన్ ద్వారా నమోదు చేసుకునే వారు తమ బయోడేటా, ఫొటోలను 83744 45190, 80080 02165 నెంబర్లకు వాట్సాప్ ద్వారా పంపవచ్చు. మరిన్ని వివరాలకు ఇవే ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు.

అండర్-19 క్రికెట్ పోటీల విజేత కరీంనగర్

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఉత్కంఠ భరితంగా సాగిన పోటీలో మహబూబ్‌నగర్ జట్టుపై కరీంనగర్ 2 వికెట్లతో తేడాతో విజయం సాధించింది. హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఓరుగల్లు జిల్లా కేంద్రంగా నిర్వహించిన అండర్-19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ముగిశాయి. శనివారం వరంగల్ నగర శివారులో ఉన్న మొగిలిచర్ల మైదానంలో మహబూబ్‌నగర్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల జట్ల మధ్య తుదిపోరు జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మహబూబ్‌నగర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. జట్టులో షాదాబ్ 89, అబ్దుల్ 48 పరుగులతో రాణించారు. కరీంనగర్ బౌలర్లు విఘ్నేష్, అర్షద్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో కరీంనగర్ జట్టు 49.5 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 241 పరుగులు చేసి విజేతగా నిలిచింది. విఘ్నేష్ 53 పరుగులు, కమ్రాన్ 50 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చారు. అనంతరం జరిగిన ముగింపు వేడుకలో అతిథులు విజేత, రన్నరప్ జట్లకు ట్రోఫీలు అందించారు. ఈ సందర్భంగా వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. అండర్-19 టోర్నీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రికెటర్లను హెచ్‌సీఏ జట్టుకు ఎంపిక చేయాలని కోరారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు పెద్ది ప్రవీణ్‌గౌడ్, బస్వరాజు శ్రీమాన్, ఉదయభానురావు, వెంకటేశ్వర్లు, రఘురాం, ఉపేందర్, రాము, కుమార్, ప్రభాకర్ పాల్గొన్నారు.


కరీంనగర్ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న అతిథులు

'అలుగు' అక్రమ రవాణా కేసులో స్మగ్లర్ల అరెస్టు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: భూపాలపల్లి అటవీ రేంజి పరిధిలోని మేడిపెల్లి టోల్‌గేట్ ప్రాంతంలో అలుగు (పొంగలిన్) రవాణాకు పాల్పడిన కేసులో శనివారం ఐదుగురు స్మగ్లర్లను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చినట్లు భూపాలపల్లి అటవీ అధికారులు తెలిపారు. ఇదే కేసులో చెన్నైకి చెందిన వైల్డ్ లైఫ్ క్రైమ్ కంట్రోల్ బ్యూరో, ఇంటెలిజెన్స్ అధికారులు చాకచక్యంగా కొనుగోలుదారుల రూపంలో తాటి రాజ్‌కుమార్, ఎండీ. నజీర్, ఎండీ.అమ్జద్‌ఖాన్‌లను అదుపులోకి తీసుకుని హనుమకొండకు తరలించిన విషయం తెలిసిందే. వీరిని విచారించగా మరో ఐదుగురి ప్రమేయం ఉందని నిందితులు చెప్పినట్లు స్థానిక రేంజి అధికారి నరేష్ అరెస్టు వివరాలను వెల్లడించారు. గట్టు సమ్మయ్య, తాళ్లపల్లి శంకర్, ఊరుగొండ దేవన్న, పెద్ది లక్ష్మయ్య, నరివెద్ది వెంకటనారాయణ కోసం గాలించగా గట్టు సమ్మయ్య, నరివెద్ది వెంకటనారాయణను అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన వారు పరారీలో ఉన్నారని, మొత్తం 8 మందిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అరెస్టు అయిన వారిలో కాటారం మండలం కొత్తపల్లి, ములుగుపల్లి, ఇబ్రహీంపల్లికి చెందిన తాటి రాజ్‌కుమార్, గట్టు సమ్మయ్య, ఎండీ.అమ్జద్‌ఖాన్, మహాముత్తారం మండలం యామన్‌పల్లికి చెందిన ఎండీ. నజీర్, భూపాలపల్లికి చెందిన నరివెద్ది వెంకటనారాయణ ఉన్నారు. వీరి నుంచి రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు రేంజి అధికారి నరేష్ తెలిపారు. కాటారం అటవీ రేంజి అధికారి హసీఫ్ అలీ, సెక్షన్ అధికారి సంతోష్, బీట్ ఆఫీసర్లు ప్రశాంత్, భాస్కర్ పాల్గొన్నారు.


అరెస్టు చూపుతున్న భూపాలపల్లి అటవీ అధికారులు

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224

కుస్తీ పోటీల్లో ఓరుగల్లుకు కాంస్యం

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్ఐ) కుస్తీ(రెజ్లింగ్) పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు తృతీయస్థానంలో నిలిచింది. నారాయణపేట జిల్లా ధన్వాడలో శనివారం జరిగిన కుస్తీ పోటీల్లో అండర్-19 బాలికల జట్టు పతకాలతో రాణించింది. బి.అంజలి 55 కిలోల విభాగంలో స్వర్ణం కైవసం చేసుకుంది. 69 కిలోల విభాగంలో సౌమ్య, 76 కిలోల విభాగంలో ఎన్.అంజలి రజత పతకాలు, 59 కిలోల విభాగంలో కావేరి, 72 కిలోల మైత్రేయి కాంస్య పతకాలు సాధించారు. స్వర్ణం నెగ్గిన బి.అంజలి దిల్లీలో జరిగే ఎస్‌జీఎఫ్ఐ(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) జాతీయస్థాయి కుస్తీ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు హనుమకొండ జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి, హనుమకొండ కళాశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. పతకాలు సాధించిన రెజ్లర్లను హనుమకొండ జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గోపాల్, తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ సంఘం కార్యదర్శి కరీం అభినందించారు.


తృతీయ స్థానంలో నిలిచిన జట్టుతో అతిథులు

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న అంపశయ్య నవీన్

బాలసముద్రం, న్యూస్‌టుడే : వన్యప్రాణులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అంపశయ్య నవీన్ అన్నారు. జాతీయ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సంయుక్తంగా శనివారం బాలసముద్రంలోని ప్రభుత్వ అభ్యసనోన్నత పాఠశాలలో 'వన్యప్రాణి సంరక్షణ - పర్యావణ పరిక్షణ' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కవులు, రచయితలు తమ కవితలు, గేయాలు వినిపించారు. వివిధ పాఠశాలల విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈ నెల 8న ముగింపు వేడుకల రోజు బహుమతి ప్రదానం చేయనున్నారు. ప్లాసిక్ వస్తువుల నివారణలో భాగంగా 'స్టీల్ బ్యాంకు' కార్యక్రమం ప్రారంభించారు. నిర్వాహకులు పురుషోత్తం, శ్రవణ్‌కుమార్, రవిబాబు, నాగేశ్వర్‌రావు, శ్యాంసుందర్, నరేష్, ఉపేందర్ రెడ్డి, సుధాకర్‌స్వామి, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులే కల్లాలు.. మక్క రైతుల అవస్థలు



రైతులు పండించిన పంటను ఆరబోసుకోవడానికి కల్లాలు లేక అవస్థలు పడుతున్నారు. రహదారిపై ఆరబోయడంతో వాహనదారుల నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఐనవోలు నుంచి సింగారం, వెంకటాపూర్ వెళ్లే రహదారుల్లో మక్కలు ఆరబోశారు. వీటి వల్ల తాము ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి కల్లాలకు స్థలాలు ఏర్పాటు చేస్తే ఇటు వాహనదారులు, అటు రైతుల సమస్య తీరుతుంది.

– న్యూస్‌టుడే, ఐనవోలు (హనుమకొండ)

శంకుస్థాపన చేశారు.. నిర్మాణం మరిచారు



ఆత్మకూరు మండలం నీరుకుళ్లలోని పెంచికలపేట వ్యవసాయ సహకార సంఘంలో గోదాము, భవన శిథిలావస్థకు చేరడంతో కూల్చివేశారు. రూ. 80 లక్షలతో నూతన గోదాము, భవన నిర్మాణానికి ఏడాది క్రితం సొసైటీ ఛైర్మన్ కంది శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు శంకుస్థాపన చేశారు. నేటికీ పనులను ప్రారంభించలేదు. దీంతో గోదామును, సొసైటీ కార్యాలయాన్ని అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. భవనాల అద్దె కోసం సంవత్సరానికి రూ. 1.70 లక్షలు చెల్లిస్తున్నామని సిబ్బంది తెలిపారు. వెంటనే భవన నిర్మాణ పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆత్మకూరు (పరకాల)

దర్గా కాజీపేటలో పోలీసుల కట్టడి ముట్టడి


ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న కాజీపేట ఏసీపీ తిరుమల్, ఇన్‌స్పెక్టర్లు

కాజీపేట టౌన్, న్యూస్‌టుడే: దర్గా కాజీపేటలో శనివారం రాత్రి పోలీసులు కట్టడి ముట్టడి నిర్వహించారు. కాజీపేట సబ్ డివిజన్ పోలీసులు పెద్ద ఎత్తున మోహరించి ప్రతి ఇంటిని సోదా చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతున్న మద్యం, గుట్కాలతో పాటు ఎలాంటి ధ్రువపత్రాలు లేని మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గాంధీ చౌరస్తాలో ఏసీపీ తిరుమల్ కాలనీవాసులను ఉద్దేశించి మాట్లాడారు. గంజాయి, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల సంక్షిప్త సందేశాలకు, లింకులకు స్పందించ కూడదని, ఒక వేళ ఎవరైన మోసపోతే 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో కాజీపేట, మడికొండ పోలీస్ ఇన్‌స్పెక్టర్లు వై. సుధాకర్‌రెడ్డి, పుల్యాల కిషన్, ఎస్సైలు నవీన్‌కుమార్, లవన్ కుమార్, మాజీ కార్పొరేటర్ అబుబకర్ పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హనుమకొండ జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. శనివారం కాజీపేటలోని సెయింట్ గాబ్రియల్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎంపిక పోటీలకు హనుమకొండ జిల్లా నుంచి సీనియర్ విభాగంలో బాలబాలికలు హాజరయ్యారు. ప్రతిభ ఆధారంగా ఎంపికైన బాలికలు ఈ నెల 7, 8, బాలురు 14 నుంచి 16వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని సంఘం అధ్యక్షుడు తాళ్లపెల్లి తెలిపారు. సంఘం కార్యదర్శి సాంబయ్య, పీఈటీ విజయ్‌కుమార్, శిక్షకులు ఇర్ఫాన్, సునీలా పాల్గొన్నారు.

ఎంపికైన జట్ల వివరాలు: బాలలు.. యశ్వంత్, హరి, సందీప్, సుమంత్, అమన్, ఉత్కర్ష్, రిషబ్, సమి, తరుణ్, రాకేష్, సుధాకర్, పవన్

బాలికలు..: రాధిక, దివ్య, హాసిని, మీనాక్షి, తేజస్వి, యుక్తి, బ్రిందా, అక్షయ, రిష్మ, షారోన్, నక్షత్ర, అశ్విత.

బీమా కంపెనీలకు అప్పగించే యోచన సరికాదు


మడికొండ చౌరస్తా నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నేతలు, కార్మికులు

మడికొండ, న్యూస్‌టుడే: తెలంగాణ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను బీమా కంపెనీలకు అప్పగించాలనుకోవడం సరికాదని, ఆ ఆలోచనలను వెంటనే ఉపసంహరించుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (బీఎన్‌ఆర్‌కేఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత కామల్ల అయిలయ్య డిమాండ్ చేశారు. సంఘం జిల్లా 6వ మహాసభను శనివారం కాజీపేట మండలం మడికొండలో ఘనంగా నిర్వహించారు. ముందుగా మడికొండ చౌరస్తా నుంచి పెట్రోల్ బంక్ వద్దనున్న వేడుకల మందిరం వరకు ర్యాలీ నిర్వహించారు. సభావేదిక వద్ద సంఘం జెండాను ఎగురవేశారు. జిల్లా అధ్యక్షుడు మూల వీరనర్సింహులు అధ్యక్షతన జరిగిన సభలో అయిలయ్య మాట్లాడారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పు సాయికుమార్, కార్యదర్శి పంకెర్ల కుమారస్వామి యాదవ్, ఉపాధ్యక్షుడు ఎస్‌కే అలీ, నాయకులు తాటికొండ మధు, ఎండీ అజీముద్దీన్, పల్లపు అంకమరావు, కాళేశ్వరపు రాజేందర్, చిక్కుడు సాయిలు, సదన్‌రావు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి వెంకటస్వామికి ఘన నివాళి


వెంకటస్వామి చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కేంద్ర మాజీ మంత్రి జి. వెంకటస్వామి జయంతిని కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి వెంకటస్వామి పేదల అభ్యున్నతి కోసం కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో డీఆర్వో గణేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలసముద్రం : నక్కలగుట్టలోని విద్యుత్తు భవన్‌లో మాజీ మంత్రి వెంకటస్వామి చిత్రపటానికి ఎన్పీడీసీఎల్ ఇన్‌ఛార్జి డైరెక్టర్లు అశోక్ కుమార్, తిరుపతిరెడ్డి, మధుసూదన్ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. అధికారులు రాజు చౌహన్, రవీంద్రనాథ్, బికంసింగ్, దేవేందర్, మాధవరావు, వేణుబాబు, శేషారావు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో దేశభక్తి

విద్యానగర్, న్యూస్‌టుడే: ఎన్‌సీసీతో విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ పెంపొదుతాయని కమాండెంట్ కల్నల్ ఎస్ఎస్ రామదురై అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్‌సీసీ ప్రత్యేక శిక్షణ శిబిరం కొనసాగుతోంది. శనివారం ఆయన క్యాడెట్లకు ఫైరింగ్, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. 2025 రిపబ్లిక్ డే పరేడ్ న్యూఢిల్లీలో పాల్గొనే క్యాడెట్స్ శిక్షణ ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్ కోసం శిక్షణ ఇస్తున్నట్లు కమాండింగ్ అధికారి తెలిపారు. పరిపాలన అధికారులు, రవి సునారే, సోరస్య, విజయ్, స్వామి రాజమాణిక్యం, వాసు పాల్గొన్నారు.

దుర్గామాత నమోనమః


చంద్రఘంట రూపంలో పద్మాక్షిదేవి


ఐనవోలులో..


వేయిస్తంభాల ఆలయంలో..

వరంగల్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీహనుమద్గిరి పద్మాక్షి ఆలయంలో అమ్మవారిని చంద్రఘంట క్రమ (గాయత్రి) రూపంలో అలంకరించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట్‌రెడ్డి సతీమణితో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు.

హనుమకొండ కలెక్టరేట్: హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడోరోజు శనివారం రుద్రేశ్వరుడికి ప్రత్యేక పూజల అనంతరం రుద్రేశ్వరిని అన్నపూర్ణగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఐనవోలు : మల్లికార్జునస్వామి ఆలయంలోని భ్రమరాంబికాదేవి అమ్మవారు చంద్రఘంట రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.

భీమదేవరపల్లి: కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో అమ్మవారిని చంద్రఘంటా క్రమంలో గాయత్రి మాతగా అలంకరించారు. భక్తులు పెద్దఎత్తున దర్శించుకొని పూజలు నిర్వహించారు.

కమలాపూర్: మండలంలోని కమలాపూర్, ఉప్పల్, శనిగరం, మరిపల్లిగూడెం తదితర గ్రామాల్లో భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

శాయంపేట: శాయంపేట మండల కేంద్రంలోని శివమార్కండేయ ఆలయంలో అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చిత్తూ చిత్తుల బొమ్మ.. శివుని ముద్దులగుమ్మ


నయీంనగర్‌లోని మోషన్ జూనియర్ కళాశాలలో..


కమలాపూర్ కళాశాలలో..


ధర్మసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

బతుకమ్మ ఉత్సవాలు జిల్లాలో వైభవంగా కొనసాగుతున్నాయి. గ్రామాలు, పట్టణాల్లో మహిళలు, యువతులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేస్తున్నారు. అనంతరం సమీపంలోని జలాశయాలు, చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేస్తున్నారు. శనివారం ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. అధ్యాపకులు పాల్గొని ప్రకృతిని ఆరాధించే పండుగ ప్రాధాన్యతను వివరించారు. – నయీంనగర్, కమలాపూర్, ధర్మసాగర్

కాంగ్రెస్ నేతకు ఎమ్మెల్యే కడియం నివాళి


శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

డీజిల్‌కాలనీ, న్యూస్‌టుడే: కాజీపేట పట్టణ సీనియర్ కాంగ్రెస్ నేత, డీజిల్‌కాలనీ భవానీ నగర్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బైరి శ్రీనివాస్ మృతికి స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రగాఢ సంతాపం తెలిపారు. శనివారం భవానీనగర్‌లో శ్రీనివాస్ భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. 63వ డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్ రాంబాబు, కాంగ్రెస్ నాయకుడు మైసారపు శిరిల్ లారెన్స్, అజ్గర్, విజయ్‌భాస్కర్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, భిక్షపతి, తిరుపతి తదితరులు ఉన్నారు.

గోశాలకు ఆవుల అప్పగింత

కాజీపేట టౌన్: కాజీపేట శివారు యాదవ్‌నగర్ సమీప వెంచర్‌లో నుంచి అక్రమంగా తరలిస్తున్న 13 దూడలు, మూడు ఆవులను భాజపా నాయకులు శనివారం పట్టుకుని ధర్మసాగర్ మండలంలోని బృందావన్ గోశాలకు అప్పగించారు. వాటిని వాహనాల్లో తరలిస్తున్నట్లు తెలుసుకున్న నాయకులు పెసరు తిలక్‌కుమార్, కంఠం శ్రీను అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. పశువులను తరలిస్తున్న వ్యక్తిని పోలీసులకు అదుపులోకి తీసుకున్నారు.

నేడు ప్రైవేటు ఉపాధ్యాయులకు సన్మానం

బాలసముద్రం: హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఆదివారం ప్రైవేటు ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలంగాణ ఆల్ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు చందర్‌లాల్ నాయక్ చౌహన్ తెలిపారు. బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంతః రాష్ట్రీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రతి ఏటా తమ సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందిస్తున్నామని చెప్పారు. సమావేశంలో ప్రకాశ్, ప్రభాకర్, ముకుందం, సుజాత, అస్మా బేగం, చంద్ర మోహన్, రంగారావు, నరేష్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

బాలసముద్రం: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ధర్మ టీచర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్ చేశారు. బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్‌సీ రిపోర్టు, 4 డీఏలను తక్షణమే ప్రకటించాలన్నారు. 700 గురుకుల విద్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించాలని కోరారు. అన్ని జిల్లాల్లో పూర్తి స్థాయి డీఈఓ, డిప్యూటీ డీఈఓలను నియమించాలని ముఖ్యమంత్రిని కోరారు. సమావేశంలో బాబు, కిషన్, జయకృష్ణ, భాస్కర్, గమానియల్, కుమార్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT HANAMKONDA

S.O.P.No. 06 of 2024

Between:
1. Uppala Sai Laxmi
2. Kalluri Sai Deepthi ...Petitioners

And

1. The Branch Manager, ICICI Bank, Balasamudram Branch, Hanamkonda.
2. The Tahsildar, Kazipet Mandal, Hanamkonda Dist.
3. To whomsoever it may concern ... Respondents

To
D3) To whom soever it may concern

NOTICE

Please take notice that the above succession O.P. is filed by the petitioner for issuance of succession certificate in respect of the death of Late Thota Ramesh, If anybody is having objections, they can appear before Hon'ble Court in-person or through a counsel on **21-10-2024 at 10.30 AM.** In the absence of objections, the case will be decided on merits according to the documents available before the court. Hence this notice

//BY ORDER OF THE COURT//
Sd/-, **KANDARI RAJAMOULI,** ADVOCATE
H.No.25-4-255/2, Vishnupuri, Kazipet
HANAMKONDA Cell : 9849147839

రుణమాఫీ అమలులో విఫలం

మడికొండ: రైతులందరికీ ఏకకాలంలో రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలులో పూర్తిగా విఫలమైందని భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్ విమర్శించారు. కాజీపేట మండలం మడికొండలో శనివారం ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా (బంధు) సాయం ఇంత వరకు ఇవ్వలేదని, ధరణి పోర్టల్ ఎత్తివేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇంత వరకు ప్రక్షాళన చేయకపోవడం అసమర్థతకు నిదర్శనమన్నారు. ఇప్పటికైనా మేల్కొని రైతులందరికీ రుణమాఫీ చేసి, రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దువ్వ నవీన్, పిట్టల రమేశ్, వినోద్, కుమార్‌బాబు, రాజన్‌బాబు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేర సమాచారం

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య


సాంబమూర్తి (పాత చిత్రం)

ఆత్మకూరు, న్యూస్‌టుడే: అప్పుల బాధతో యువ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆత్మకూరు మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తిరుమలగిరి గ్రామానికి చెందిన కాత్రేవుల సాంబమూర్తి (29)కి నాలుగేళ్ల కిందట వివాహం అయింది. ఇద్దరు కుమారులు ఉన్నారు. సొంత పొలం లేకపోవడంతో మూడేళ్లుగా 8 ఎకరాల భూమి కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. పంటల దిగుబడి రాకపోవడంతో పెట్టుబడి కోసం చేసిన రూ.6 లక్షలు భారంగా మారాయి. వాటిపై వడ్డీ పెరిగింది. వాటిని తీర్చేమార్గం కనిపించక ఈ నెల 3న గురువారం పొలం వద్ద పురుగుల మందుతాగి భార్యకు సమాచారం ఇచ్చారు. స్థానికుల సాయంతో ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంతోష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

ఎల్కతుర్తి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఎల్కతుర్తి మండలం పెంచికల్‌పేటకు చెందిన రైతు సురకంటి రాజిరెడ్డి (70) ఈ నెల 4న ద్విచక్ర వాహనంపై వల్లభాపూర్‌కు వెళ్లి వస్తుండగా.. ఫార్మసీ కళాశాల సమీపంలో అదుపుతప్పి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం 108లో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. కుమారుడు తిరుపతిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పింఛను డబ్బులకు వెళ్తూ వృద్ధుడి..

ఎల్కతుర్తి, న్యూస్‌టుడే: పింఛను డబ్బుల కోసం వెళ్తున్న వృద్ధుడు ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందినట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామానికి చెందిన మైస అయిలయ్య (60) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆసరా పింఛను డబ్బుల కోసం శనివారం సైకిల్‌పై ఎల్కతుర్తిలోని బ్యాంకు వద్దకు బయలు దేరారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో మార్గం మధ్యలో ఓ చెట్టు కింద మోరీపై కూర్చున్నారు. ప్రమాదవశాత్తు బండరాళ్లపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన భార్య వినోద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సాయిబాబా ఆలయంలో చోరీ

భీమదేవరపల్లి: కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని సాయినగర్ సాయిబాబా ఆలయంలో హుండీ చోరీకి గురైంది. శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు హుండీని ఎత్తుకెళ్లి సమీపంలోని పత్తి చేనులో పడేశారు. దాన్ని పగులకొట్టి భక్తులు వేసిన కానుకలు అపహరించారు. శనివారం ఎస్ఐ సాయిబాబు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

ఎంఆర్ఎఫ్ షోరూంలో..

పరకాల : పట్టణంలోని భూపాలపల్లి రోడ్డులో ఎంఆర్‌ఎఫ్ షోరూంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... గుర్తు తెలియని వ్యక్తి వెనుకవైపు ఉన్న తలుపును తొలగించి లోపల చొరబడ్డారు. కౌంటర్‌లో ఉన్న నగదు, సీసీ కెమెరాను పట్టుకెళ్లారు. శనివారం బాధితుడు గౌరిశెట్టి కృష్ణకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ క్రాంతికుమార్ తెలిపారు.

నగదు అపహరణపై ఫిర్యాదు

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: కారులో పెట్టిన నగదు చోరీకి గురైన ఘటనపై శనివారం మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేశారు. హనుమకొండ భీమ్‌నగర్‌కు చెందిన డా.శ్రీనివాస్ వరంగల్ సంరక్ష ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. శ్రీనివాస్ కారు చోదకుడు శరత్‌కుమార్ ఈ నెల 1న కారు బయటికి తీసుకెళ్లి వచ్చాడు. మరుసటి రోజు కారును పరిశీలించగా.. అందులోని రూ.54 వేల నగదు కనిపించలేదు. దీంతో బాధితుడి చోదకుడిపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదు చేశారు.

యువకుడి అదృశ్యం

మడికొండ, న్యూస్‌టుడే: యువకుడి అదృశ్యంపై మడికొండ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ కథనం ప్రకారం.. రాంపేటకు చెందిన జెల్ల సందీప్‌కుమార్ (33) ఈ నెల 1న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తెలిసిన వారు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లేకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు మడికొండ సీఐ, ఎస్సై ఫోన్ నెంబర్లు 8712685123, 8712685248లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

రావణ వధ కార్యక్రమాలు నిషేధించాలని వినతి

ఎల్కతుర్తి, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా చేసే రావణ వధ కార్యక్రమాలను నిషేధించాలని అంబేడ్కర్ సంఘం రాష్ట్ర అధికారి ప్రతినిధి తూముల సదానందం కోరారు. శనివారం ఎల్కతుర్తిలో తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేశారు. నాయకులు మేకల చేరాలు, శనిగరం వెంకటేష్, పెండ్యాల సుదర్శన్, సాతూరి ప్రసాద్, ఆర్యన్, కడారి రాజేందర్ పాల్గొన్నారు. ముగిసిన నల్‌జల్ మిత్ర శిక్షణ

ఎల్కతుర్తి: మిషన్ భగీరథ మంచినీటి సహాయకులకు స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న నల్‌జల్ మిత్ర శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. వారికి అధికారులు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఈ అనిల్, ఏఈ సుభాష్‌రెడ్డి, గ్రిడ్ డీఈ శ్రీనివాస్, ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, ఎంపీడీవో విజయ్ కుమార్ పాల్గొన్నారు.

పరకాల నియోజకవర్గం

లక్ష్యసాధనకు నిరంతరం శ్రమించాలి


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పరకాల: విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఎంచుకొని క్రమశిక్షణతో శ్రమించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.లలితాదేవి అన్నారు. శనివారం పరకాలలో ఎస్‌వీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. డీఐఈవో గోపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రిన్సిపల్ సిరికొండ శ్రీనివాసచారి, కరస్పాండెంట్ శోభారాణి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఆడ పిల్లలను రక్షించుకోవాలి

దామెర: ఆడ పిల్లలను రక్షించుకోవడం అందరి బాధ్యత అని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ పి.దామోదర్ అన్నారు. శనివారం పసరగొండ గ్రామంలో లింగాధారిత హింస నివారణ, మహిళా రక్షణ చట్టాలపై శిక్షణ నిర్వహించారు.

భారాస యువజన సంఘం అధ్యక్షుడిగా మోహన్

శాయంపేట, న్యూస్‌టుడే: భారాస మండల యువజన అధ్యక్షుడిగా మారపెల్లి మోహన్‌ను శనివారం ఎన్నుకున్నారు. భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ గండ్ర జ్యోతిలు అభినందనలు తెలిపారు.

సభ్యత్వ నమోదు జయప్రదం చేయండి

శాయంపేట: భాజపా సభ్యత్వ నమోదును జయప్రదం చేయాలని పరిశీలకులు జన్నె మొగిలి అన్నారు. శాయంపేటలో సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం నిర్వహించారు. రాయరాకుల మొగిలి, నరహరిశెట్టి రామకృష్ణ, సత్యనారాయణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

శాయంపేట: సూర్యనాయక్ తండాలోని గుడుంబా స్థావరాలపై పరకాల ఎక్సైజ్, సివిల్ పోలీసులు సంయుక్తంగా శనివారం దాడులు నిర్వహించారు. 1500 లీటర్ల చెక్కర పానకం, 35 లీటర్ల గుడుంబాను ధ్వంసం చేసినట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు.

PARAS
పృథ్వీ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ సెక్యూరిటైజేషన్ కంపెనీ లిమిటెడ్
నమోదిత మరియు కార్పొరేట్ కార్యాలయం: డి.నెం. 1-55, రాజ ప్రసాదము, 4వ అంతస్తు, వింగ్-I, మసీదు బండ రోడ్, కొండాపూర్, హైదరాబాద్-84
CIN: U67120TG2007PLCO53327, ఫోన్: 040-41413333, ఫ్యాక్స్: 040-41413301.
ఇమెయిల్: co@paras.org.in, వెబ్: www.paras.org.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు విక్రయ ప్రకటన (రూల్ 8(6) నిబంధనను చూడండి)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)& 6(2)కు గల నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 కింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

మెసర్స్ పృథ్వీ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ సెక్యూరిటైజేషన్ కంపెనీ లిమిటెడ్ (PARAS)కు **M/s. MSR మెగా బయో పవర్ లిమిటెడ్** నుండి రావల్సిన బకాయి మొత్తం 30.09.2024 నాటికి రూ.131,78,07,599/- (ఒక వంద ముప్పై ఒక్క కోట్ల డెబ్బై ఎనిమిది లక్షల ఏడు వేల ఐదు వందల తొంభై తొమ్మిది రూపాయలు మాత్రమే) మరియు దానిపై తదుపరి వడ్డీ మరియు వ్యయాలను రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తేదీ, సమయం మరియు ప్రదేశం వద్ద **"ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలానే"** ప్రాతిపదికన సీల్డ్ టెండర్స్ కమ్ వేలం రూపంలో SARFAESI చట్టంలోని నిబంధనల క్రింద దిగువ సంతకందారుచే దిగువ తెలిపిన సెక్యూర్డ్ ఆస్తులు విక్రయించబడునని సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.

హామీగల స్థిరాస్తుల వివరం

ఐటమ్ నెం.1	రిజర్వు ధర: రూ.5,00,00,000/-	ధరావతు: రూ.50,00,000/-

వరంగల్ జిల్లా, రఘునాథపల్లి మండలం, నిడిగొండ గ్రామంలో సర్వే నెం.177/సి, 178/ఎ, 178/ఎ/1, 177/డి, 179/ఎ వద్ద గల ప్లాంట్ మరియు మెషినరీ.

ఐటమ్ నెం.2	రిజర్వు ధర: రూ.18,00,00,000/-	ధరావతు: రూ.1,80,00,000/-

M/s. M.S.R మెగా బయోపవర్ లిమిటెడ్‌కి చెందిన, వరంగల్ జిల్లా, రఘునాథపల్లి మండలం, నిడిగొండ గ్రామంలో సర్వే నెం.177/సి, 178/ఎ, 178/ఎ/1, 177/డి, 179/ఎ వద్ద గల 12 ఎకరాల విస్తీర్ణపు ఫ్యాక్టరీ భూమి మరియు దానిపై ఉన్న భవనం మరియు దీనికి అతికించబడినవి. సరిహద్దులు: తూర్పు: మార్గం, ఉత్తరం: ఎం.శ్రీనివాస్ రెడ్డి వ్యవసాయ భూమి, పడమర: ఎం శ్రీనివాస్ రెడ్డి వ్యవసాయ భూమి, దక్షిణం: బండి కొమురయ్య మరియు బండి భద్రయ్య వ్యవసాయ భూమి.

ఎన్కంబ్రెన్సుల / వ్యాజ్యాల జాబితా

న్యాయస్థానం పేరు	కేస్ నెం.	ప్రస్తుత స్థితి
గౌరవనీయ డెబ్ట్స్ రికవరీ ట్రిబ్యునల్ - II, హైదరాబాద్	ట్రాన్స్‌ఫర్ అప్లికేషన్ అనగా టిఏ 3316/2017	అపరిష్కృతం
	సెక్యూరిటైజేషన్ అప్లికేషన్ అనగా ఎస్ఏ 242/2021	అపరిష్కృతం

విక్రయ వివరమైన నియమ నిబంధనల కొరకు మెసర్స్ పృథ్వీ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ సెక్యూరిటైజేషన్ కంపెనీ లిమిటెడ్ వెబ్‌సైట్ అనగా **www.paras.org.in/tenders** లో ఇచ్చిన లింక్‌ను చూడవచ్చును. సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ **http://www.bankeauctions.com** ద్వారా **"ఆన్‌లైన్ - వేలం అమ్మకం"** విధానాన్ని అనుసరిస్తూ షెడ్యూలు ఆస్తి/ఆస్తుల అమ్మకం నిర్వహించబడును. ఇ-వేలం తేదీ, బిడ్ ఫారం దాఖలు చివరి తేదీ, రిజర్వు ధర, ధరావతు, బిడ్ పెంపుదల మొత్తము మరియు ఇ-వేలం సమయం వివరాలు దిగువనివ్వబడినవి:

ఇ-వేలం తేది	ఐటమ్ నెం.	బిడ్ పెంపుదల	వేలం సమయం
12.11.2024	1	రూ.5,00,000/-	ఉ. 11.00 గం.లు
	2	రూ.25,00,000/-	ఉ. 11.30 గం.లు

వేలం ముగింపు సమయానికి ముందు బిడ్ వేయబడినచో, ప్రతిసారి 5 నిమిషాల ఆటో ఎక్స్‌టెన్షన్ క్లాజ్‌తో ఇ-వేలం సమయం అనగా ఇ-వేలం సమయం ప్రతిసారి 5 నిమిషాలు పొడిగించబడును.

సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ **https://www.bankeauction.com** ద్వారా **"ఆన్‌లైన్ ఇ-వేలం"**లో పాల్గొనవల్సిందిగా ప్రజానీకం కోరబడుచున్నారు. సర్వీసు ప్రొవైడర్ చిరునామా వివరాలు: మెసర్స్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సంప్రదించవలసిన వ్యక్తి: 1) శ్రీ ధరణి కృష్ణ, కాంటాక్ట్ నెం.9948182222, ఇ-మెయిల్ ఐడి: 1) **dharani.p@c1india.com & 2) andhra@c1india.com** పాల్గొనదలచిన వారు/ బిడ్డర్లు ఇ-వేలం అమ్మకం వివరమైన నియమనిబంధనల కొరకు వెబ్‌సైట్ https://www.bankeauction.com మరియు www.paras.org.in/tenders ను అనుసరించవల్సిందిగా విజ్ఞప్తి మరియు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, యూజర్ ఐడి, పాస్‌వర్డ్, సహాయం, విధానం, ఇ-వేలం వగైరా గురించి ఆన్‌లైన్ శిక్షణ కొరకు, వారి బిడ్ ఫారాల దాఖలు కొరకు మరియు ఇ-వేలం అమ్మకం ప్రొసీడింగ్స్‌లో పాల్గొనుట కొరకు సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించవల్సిందిగా కూడా కోరబడుచున్నారు. పాల్గొనదలచిన వారు ఇఎండి మొత్తాన్ని RTGS/NEFT/ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ ద్వారా సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క దిగువ తెలిపిన ఇ-వేలం కలెక్షన్ ఖాతాకు జమ చేయవలెను.

ఖాతా నెం.	100631100000229
సెక్యూర్డ్ క్రెడిటార్	మెసర్స్ పృథ్వీ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ సెక్యూరిటైజేషన్ కంపెనీ లిమిటెడ్
బ్యాంక్	యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
శాఖ	మిడ్ కార్పొరేట్ శాఖ, పంజగుట్ట, హైదరాబాద్
IFSC కోడ్	UBIN0577901

పై వేలం పట్టికలో తెల్పిన చివరి తేది లోపు అవసరమైన వివరాలు అనగా **ఇఎండి డిపాజిట్ రుజువు, పాన్ కార్డు, ఆధార్, చిరునామా మరియు ఐడి** రుజువులతో ఆన్‌లైన్‌లో బిడ్ ఫారాలను దాఖలు చేయవల్సిందిగా ఔత్సాహిక బిడ్డర్లకు విజ్ఞప్తి. ఔత్సాహిక బిడ్డర్లు తగువిధంగా పూరించిన బిడ్‌ఫారం హార్డుకాపీతోపాటు పై డాక్యుమెంట్ల స్వీయధ్రువీకృత కాపీలను రిజిస్టర్డు పోస్టు/ స్పీడ్ పోస్టు/ కొరియర్ ద్వారా ఈ క్రింది చిరునామాలోని దిగువసంతకందారు చిరునామా: శ్రీ కె.వి రామకృష్ణ ప్రసాద్, అధీకృత అధికారి, మెసర్స్ పృథ్వీ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ సెక్యూరిటైజేషన్ కంపెనీ లిమిటెడ్, డోర్ నెం.1-55, 4వ అంతస్తు, 'రాజ ప్రసాదము', మసీదుబండ రోడ్, కొండాపూర్, హైదరాబాద్ 500084 వారికి **11.11.2024 సా.5.00 గం.లోగా** పంపవలెను. తపాలా జాప్యాలు అంగీకరించబడవు.

ఇ-వేలంలో పాల్గొనే ముందు ఆస్తిని చూసి ఆస్తి వివరాల గురించి మరియు సంబంధిత ఎస్ఆర్‌ఓ వద్ద దాని రిజిస్ట్రేషన్ అర్హత గురించి కూడా స్వయంగా సంతృప్తి చెందవల్సిందిగా ఔత్సాహిక బిడ్డర్లకు విజ్ఞప్తి.

ఆస్తుల తనిఖీ తేది మరియు సమయం: 02.11.2024న ఉ.11.00 గం. నుండి మ.1.00 గం.మధ్య.

వివరమైన సందేహ నివృత్తులు, నియమనిబంధనలు, మార్గదర్శనం, షెడ్యూలు ఆస్తి తనిఖీ, ఇ-వేలం అమ్మకానికి ఉంచిన ఆస్తి టైటిల్ డీడ్స్ మరియు ఇటీవలి ఎన్కంబ్రెన్స్ సర్టిఫికెట్లను చదువుకొనుట, ఆస్తి టైటిల్ గురించి తగు జాగ్రత్త వహించడం మరియు స్వయంగా సంతృప్తి చెందుటకు శ్రీ మొహమ్మద్ యాసీర్, సీనియర్ మేనేజర్ (లీగల్ & రిజల్యూషన్స్)ను మొబైల్ నెం. 91 - 7032806200, కార్యాలయ ల్యాండ్ లైన్ నెం.040-41413341, ఇమెయిల్ ఐడి **yaseer@paras.org.in**ను సంప్రదించవల్సిందిగా కూడా ఔత్సాహిక పాల్గొనువారికి విజ్ఞప్తి. ఏదేని కారణం వలన పైన ఇందులో తెలిపిన షెడ్యూల్డు వేలం రద్దయినచో, SARFAESI చట్టం, 2002 లోని నిబంధనల క్రింద ప్రైవేట్ ఒప్పందంచే ఈ నోటీసు ద్వారా వేలం క్రింద సెక్యూర్డ్ ఆస్తులను విక్రయించు హక్కు PARAS కలిగి ఉంటుంది.

పైన తెలిపిన తేదీన అమ్మకం నిర్వహించుట మరియు ఇతర వివరాలను గురించి **మెసర్స్ బయో పవర్ లిమిటెడ్** యొక్క రుణగ్రహీత/ తనఖారుణగ్రస్తులు/ గ్యారంటార్లకు ఇది నోటీసుగా కూడా ఉంటుంది.

తేది: 03-10-2024
ప్రదేశం: హైదరాబాద్

(అధీకృత అధికారి)
మెసర్స్ పృథ్వీ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ సెక్యూరిటైజేషన్ కంపెనీ లిమిటెడ్